# రెండో పెళ్లి

**శే**షాచలంగా ముప్పైతొమ్మిదో ఏట పదేళ్ల పిల్లని రెండో పెళ్లి చేసుకున్నాడు. ముప్పై తొమ్మిదేళ్ల వాడికి పెళ్లాం అవసరమనేది శేషాచలంగారంగీకరించాడు గాని తనకన్న ఇరవై తొమ్మిదేళ్లు చిన్నదైన పెళ్లాం ఆయనకు తృప్తికరంగా లేదు. తనకు ముప్పై ఏళ్ల కన్య ఎట్లా దొరుకుతుందీ? దొరికితే మటుకు పెళ్లాడితే నలుగురూ ఏమంటారు? పోనీ. పెళ్లి చేసుకోకుండా ఉందామా అంటే ఇతర విషయాలట్లా ఉంచి తనకిన్ని నీళ్లు వదలటానికన్నా లేరే!

తీరా పెళ్లి అయింతరవాత ఆలోచిస్తే నలుగురూ బలవంతాన తన పెళ్లి చేసినట్టుగా తోచిందాయనకు.

“ఇంకా నలభై కూడా రాలేదుగా?” అన్నారు కొందరు, ఇంకో సంవత్సరంలో తనకు వివాహయోగ్యత లేకుండా పోయేటట్టు.

“నీకు బుద్ధి ఉందా! నీకన్న ముప్పయ్యేళ్లు చిన్నపిల్లనేమని పెళ్లాడావు!” అన్నవాడు లేడు, రేపటినించీ ఆమాట అననివాడూ ఉండడు.

పెళ్లికి ఎదిగిన పిల్లలు రెండు జాతులుంటే బాగుండును – తనకు ఈడయిన వారిని చేసుకోదగినవాళ్లూ, ముసలివాళ్లను మాత్రమే చేసుకోదగినవాళ్లూ అంటూ! ఒక పిల్లకు చిన్న మొగుడే దొరుకుతాడో పెద్ద మొగుడే దొరుకుతాడో నిర్ణయించటానికి లేకపోవటం దారుణం.

లేదా చిన్న పిల్లల ఆటల్లో ‘దొంగ’ అయ్యే మనిషిని నిర్ణయించటానికి కొన్ని నిబంధనలు పెట్టినట్టు, పెద్దవాళ్లకు చిన్నపిల్లల్ని అంటగట్టటానికి కూడా కొన్ని నిబంధనలు పెడితే?

తన పెళ్లాన్ని ఏ డెబ్బయ్యేళ్ల మొగుడికో ఇవ్వాలని శాసనం జరిగి ఉండి ఆ మీదట తను.... నలభై కూడా లేనివాడు... మొగుడైతే ఎంత సంతోషించేది!

ఆడవాళ్లెంతలోకి ముసలాళ్లవుతార్లే? ఇద్దరు పిల్లల్ని కంటే తన భార్య మరో పదేళ్లలో అవ్వ అవుతుంది.

శేషాచలంగారనుకున్నట్లే పార్వతమ్మ ఇరవై ఏళ్లయినా రాకపూర్వమే ఇద్దరు పిల్లల్ని

కని నేవళం పోగొట్టుకున్నది. ఆ దంపతుల వయస్సులో తేడా గమనించడం కూడా మరిచారు ప్రజలు. చిన్నపిల్ల మొగుడు కావటం వల్లనో ఏమో శేషాచలంగారీ పది సంవత్సరాల కాలంలోనూ ఏమీ మారలేదు - తెల్లవెంట్రుకలు జాస్తి కావటం తప్ప.

ఇంకో ఇరవై ఏళ్లు గడిచినై. శేషాచలంగారు రాయల్లే ఉన్నాడు. ఒక చత్వారం లేదు. పళ్లు కదలటంలేదు. నడుము నొప్పిలేదు. చెవుడు లేదు. పార్వతమ్మ అప్పుడే రెండు దంతాలను పీకించి కళ్లజోడు పెట్టింది. ఆవిడ తలకట్టు జనపనార పొళానికి వచ్చేసింది.

శేషాచలంగారు తన వివాహం గురించి ఒకప్పుడు పడ్డ దిగులంతా పూర్తిగా మరిచారు.

వాళ్ల పెద్దబ్బాయి బియ్యే ప్యాసయి, ఉద్యోగం సంపాదించి పైకొస్తున్నాడు. వాడు కథలు అవీ రాస్తున్నట్టూ, వాటిని నలుగురూ బాగున్నవంటున్నట్టూ విని శేషాచలంగారు సంతోషించారే కాని, ఆ కథలేవీ తను మాత్రం చదవలేదు.

ఓ నాడు అబ్బాయి ఇంట్లో లేని సమయంలో పోస్టుబంట్రోతొచ్చి ఒక పత్రిక పడేసి పోయినాడు. శేషాచలంగారు పరధ్యాన్నంగా పత్రికవిప్పి పేజీలు తిప్పుతుంటే కుమారుడి పేరు కళ్లపడ్డది. ఆయన చిరునవ్వు నవ్వుకుంటూ చదవ నారంభించాడు. కథపేరు 'మా తాత'. అబ్బాయికి మంచి ఊహాజ్ఞానం ఉండి ఉండాలి. లేకపోతే వాడే తాతనెరుగును గనుకా?

చదువుతున్న కొద్దీ శేషాచలం గారి మొహం పాలిపోయింది. అబ్బాయి కథలో తాత మూడుమూర్తులా శేషాచలంగారే!

***ముద్రణ : కవిరాట్టు, అభూత కల్పనలు - గల్పికలు, 1942***
***యువ కార్యాలయం, తెనాలి***